నాడు నిధులు పుష్కలం.. నేడు నిర్లక్ష్యం

- కలగా గుండేరు వాగుపై వంతెన నిర్మాణం
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.5.5 కోట్లు కేటాయింపు
- నేడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- రెండు మండలాల ప్రజలకు ఇబ్బందులు

కామవరపుకోట: మండలంలోని కళ్ల చెరువు సమీపంలోని గుండేరు వాగుపై వంతెన నిర్మాణం కలగా మారింది. వైఎస్సార్‌సీపీ హయాంలో యుద్ధ ప్రాతిపదికగిన ఈ వంతెన నిర్మాణానికి రూ.5.5 కోట్లు కేటాయించారు. ఇలాగో ఎన్నికలు రావడం కూటమి పార్టీలు అధికారంలోకి రవడంతో ఈ వంతెన నిర్మాణాన్ని గాలికి వదిలేశారు. ఈ వంతెన నిర్మాణం చేపట్టే వరకు బ్రిడ్జి డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఐనా నేటికీ వంతెన, డైవర్షన్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు.

కుంగిన వంతెన

లింగపాలెం మండలం ఆశన్నగూడెం సమీపంలో, కామవరపుకోట మండలం కళ్లచెరువు సమీపంలో రెండు మండలాలను కలిపే గుండేరు వాగుపై ఉన్న వంతెన కుంగిపోయింది. ఈ వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన మీదుగా రైతులు మొక్కజొన్న, పామాయిల్, కోకో, నిమ్మ వంటి అనేక రకాల వ్యవసాయ ఉత్పత్తులను ఫ్యాక్టరీలకు, వ్యాపార సంస్థలకు తరలించేవారు. ఇటీవల వర్షాలు, వరదల కారణంగా వంతెన పూర్తిగా కుంగిపోయింది. దీంతో వాహనచోదకులు, రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వెంటనే గుండేరు వాగుపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలకు కుంగిన గుండేరు వాగు వంతెన



నిర్మాణం చేపట్టాలి



కామవరపుకోట, లింగపాలెం మండలాల ప్రజలు నిత్యం ఈ వంతెన పై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఆ వంతెన గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరటంతో ఆయిల్ పామ్, అరటి, నిమ్మ వంటి వ్యవసాయ ఉత్పత్తుల తరలింపునకు రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది కురిసిన వర్షాలతో వంతెన పూర్తిగా కుంగిపోయింది. అధికారులు స్పందించి నిధులు కేటాయించి త్వరగా వంతెన నిర్మాణం చేపట్టాలి.

– కంభం విజయరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్, చింతలపూడి

డైవర్షన్ రోడ్డు నిర్మించాలి



మా ప్రాంతం నుంచి వ్యవసాయం, వ్యాపారాల నిమిత్తం నిత్యం లింగపాలెం మండలం రంగాపురం, ఆసన్నగూడెం, వేములపల్లి ప్రాంతాలకు ఈ వంతెన దాటి వెళుతుంటాం. ఈ ఏడాది కురిసిన వర్షాలతో వంతెన పూర్తిగా కుంగిపోయింది. వంతెనపై నుంచి, వాహనాలు వెళ్లాలంటే ప్రమాదకరంగా మారింది. అధికారుల స్పందించి వంతెన నిర్మాణం చేపట్టే వరకు డైవర్షన్ రోడ్డు నిర్మించాలి.

– నౌడు వెంకట అప్పారావు, రైతు, కళ్లచెరువు

9న ఏలూరులో జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీసు, సెట్ వెల్ ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యములో ఈ నెల 9న సెట్‌వెల్ కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్, ఏలూరులో నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వి.వరలక్ష్మి శనివారం తెలిపారు. శ్రీ సిటీలోని కాడ్బరీ కంపెనీ ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఫార్మల్ డ్రెస్‌లో రెజ్యూమ్, సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 8886882032లో సంప్రదించవచ్చన్నారు.

8, 9 తేదీల్లో ఆటల పోటీలు

కామవరపుకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 8, 9 తేదీల్లో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.శ్యామలాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, –17 విభాగాల్లో కోకో, చెస్, కబాడీ, బాడ్మింటన్, యోగ, అథ్లెటిక్స్ ఆటల పోటీలు నిర్వహిస్తామని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులంతా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అండర్–14 విభాగానికి 2012 జనవరి 1 తరువాత, అండర్–17 విభాగానికి 2009 జనవరి 1 తరువాత పుట్టిన విద్యార్థులు అర్హులని తెలిపారు.

శిథిల రోడ్లు.. తరచూ ప్రమాదాలు



నరసన్నపాలెం రోడ్డుపై లేచిన రాళ్లు



శిథిలమైన చంద్రన్నపాలెం - తోచలక రోడ్డు

లింగపాలెం : రహదారుల అధ్వానంగా మారాయి. రోడ్లపై రాళ్లు లేచిపోవడం, గోతులు ఏర్పడడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లింగపాలెం మండలం వెంకటాపురం నుంచి నరసన్నపాలెం మీదుగా కొత్తపల్లి వెళ్లే రోడ్డు, చంద్రన్నపాలెం నుంచి తోచలక రోడ్డు, పాశ్యానగరం, లక్ష్మీ గణపతివారిగూడెం, మరికొన్ని గ్రామాల రోడ్లపై ప్రయాణానికి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఐతే రోడ్డు గోతుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు పునర్నిర్మించాలి



గోతుల మయంగా మారిన రోడ్లను పునర్నిర్మించాలి. రోడ్లపై గోతులకు కారణంగా ప్రజలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో రాకపోకలు ప్రాణాంతకంగా మరాయి.

– కె.వెంకటేశ్వరరావు, శింగగూడెం

రేపు జాతీయ ఎస్టీ కమిషన్ మోదేలు సందర్శన

బుట్టాయగూడెం: అభయారణ్యంలో ఉన్న మోదేలు గ్రామానికి మంజూరైన రోడ్డు, విద్యుత్ సదుపాయం ఏర్పాటుకు ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలు చెప్పడంతో ఆ గ్రామ గిరిజనులు ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీన మోదేలు గ్రామాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు సందర్శించనున్నారు. దీంతో గ్రామస్తులు సుమారు 5 కిలో మీటర్ల మేర రహదారిని శ్రమదానంతో బాగు చేశారు. శనివారం పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు మోదేలు గ్రామాన్ని సందర్శించారు. డీఎస్పీ, పోలీస్ సిబ్బంది లంకపాకల వరకు జీపుల్లో, వాహనాలు వెళ్లేందుకు అనుకూలంగా రోడ్డు లేకపోవడంతో లంకపాకల నుంచి ద్విచక్ర వాహనాలపై మోదేలు గ్రామం చేరుకున్నారు. డీఎస్పీ గిరిజనుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. ఆరోగ్యాలపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. పిల్లలను చదివించాలని తల్లిదండ్రులను సూచించారు. టి.నర్సాపురం, వేలేరుపాడు ఎస్సైలు ఎం జయబాబు, ఐ.నవీన్‌కుమార్, బుట్టాయగూడెం స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణంరాజు, రైటర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

అంజన్నకు అభిషేక సేవ



అంజన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు



పారిజాతగిరి వెంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో ఆంజనేయస్వామికి అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై స్వామి ఉత్సవమూర్తికి అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం చేశారు. ఆలయానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.3,21,918 సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. స్వామి వారి నిత్యాన్నదానానికి అయినవిల్లికి చెందిన కె.వీరవెంకట విశ్వేశ్వరరావు (ఆంజనేయస్వామి గురువులు) రూ.96 వేలు విరాళంగా ఇచ్చారని చెప్పారు.

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు చేశారు. గోవింద మాల, అయ్యప్ప, భవానీ మాలాధారులు, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయా నికి పూజా టిక్కెట్లు, విరాళాలు, ప్రసాదాలు, ప్రత్యేక దర్శనం, హారతి ద్వారా రూ.1,02,370 ఆదాయం సమకూరినట్టు ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఆలయాల వద్ద అన్నసమారాధనలు



జంగారెడ్డిగూడెం : అన్నసమారాధనను ప్రారంభించిన చైర్‌పర్సన్ లక్ష్మి



కొయ్యలగూడెం : అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: స్థానిక సుబ్బంపేట రోడ్డులోని లలితాదేవి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభించారు. దసరా ప్రతి కుటుంబంలో మంచి జరిగిందని ఆమె కాంక్షించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వాములకు భిక్ష

అయ్యప్ప స్వాములకు గురవాయిగూడెం శ్రీహరి హరసత అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో మూడో రోజు భిక్ష ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: దేవి శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా స్థానిక టెంపుల్స్ సెంటర్లోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయం వద్ద శనివారం మధ్యాహ్నం పాలకమండలి అధ్యక్షుడు మంతెన సోమరాజు ఆధ్వర్యంలో నాలుగు వేలకు పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అమ్మవారి లడ్డూ ప్రసాదం, అలంకరణ కరెన్సీ నోట్లకు నిర్వహించిన వేలంపాటలో భక్తులు పోటీపడి వాటిని దక్కించుకున్నారు.

కోలాహలంగా అమ్మవార్ల ఊరేగింపు



జంగారెడ్డిగూడెం : గంగానమ్మ గ్రామోత్సవంలో విచిత్ర వేషధారణలు



జంగారెడ్డిగూడెం : రథంపై ఊరేగుతున్న గంగానమ్మ

జంగారెడ్డిగూడెం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం గంగానమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంపై ఉంచి, బాణసంచా, తీన్‌మార్‌డప్పులు, సన్నాయి మేళాలు, ప్రత్యేక వేషధారణల నడుమ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నెల 5న ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మహాన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శివయ్యకు రుద్రాభిషేకం

జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయంలో కొలువైన నర్మదా అమృత బాణలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శరన్నవరాత్రి వేడుకలు పౌర్ణమి చండీ హోమంతో సంపూర్ణమవుతాయని, ఈ క్రమంలో రుద్రాభిషేకం నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు, ప్రధానార్చకులు కాళ్లకూరి శంకర్ మహేష్ శర్మ తెలిపారు. ఆదివారం గోపూజ, సోమవారం చండీహోమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆలయ అభివృద్ధికి పోలుపర్తి కన్నారావు, విజయలక్ష్మి దంపతులు రూ.5,116 అందజేశారని ఆలయ కమిటీ చైర్మన్ రాజాన పండు తెలిపారు.

దుర్గమ్మ ఊరేగింపు

బుట్టాయగూడెం: వివిధ రూపాల్లో పూజలందుకున్న కనకదుర్గమ్మ ప్రతిమను శనివారం బుట్టాయగూడెంలో వైభవంగా ఊరేగించారు. అనంతరం గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయంలో నిమజ్జనం చేశారు. రెడ్డిగణపవరం విశ్వేశ్వర కనకదుర్గ అన్నపూర్ణమ్మవారి ఆలయం వద్ద కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన దుర్గా విష్ణు అనే వ్యక్తి రూ.10 వేలకు దక్కించుకున్నారు. ఈ లడ్డూను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, ఆలయ ధర్మకర్త భౌమరాజు సత్యనారాయణరాజు చేతుల మీదుగా విష్ణుకు అందజేశారు.

ధర్మాజీగూడెంలో..

లింగపాలెం : గ్రామాల్లో అమ్మవార్లను వైభవంగా ఊరేగించారు. ధర్మాజీగూడెం శివాలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాల ఊరేగింపు కనుల పండుగగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



బుట్టాయగూడెం : కనకదుర్గమ్మ ఊరేగింపు



లింగపాలెం : ధర్మాజీగూడెంలో అమ్మవారి ఊరేగింపు



బుట్టాయగూడెం : రెడ్డిగణపవరంలో లడ్డూను దక్కించుకున్న భక్తుడు

అట్టహాసంగా ఊరేగింపు



ఊరేగుతున్న దుర్గాదేవి

ద్వారకాతిరుమల: దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని క్షేత్రంలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద, పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహాలను కమిటీల సభ్యులు శనివారం రాత్రి అట్టహాసంగా ఊరేగించారు. రాత్రి అమ్మవార్ల విగ్రహాలను పంగిడిగూడెం పోలవరం కుడి కాలువలో నిమజ్జనం చేశారు. క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు, వివిధ ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చిన యాత్రికులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత వారంతా ఆలయంలో కొలువైన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

సొంత పార్టీ నాయకుల నుంచే వేధింపులు

చింతలపూడి : స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకం విషయంలో జనసేన పార్టీ నాయకుల మధ్య ఏర్పడిన విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న తనను సొంత పార్టీ నాయకులే టార్గెట్ చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి తూము విజయ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ పదవి అనర్హులైన వ్యక్తికి కేటాయించారని ఆరోపించారు. దీనిపై పునరాలోచించాలని ఆయన డిమాండ్ చేశారు. శింగంగంశెట్టి శివకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యాయామ పరికరాల వితరణ



వ్యాయామ పరికరాలను ప్రారంభిస్తున్న డాక్టర్ సతీష్

కొయ్యలగూడెం : స్థానిక వృద్ధాశ్రమంలో వ్యాయామ పరికరాలను డాక్టర్ నరహరిశెట్టి సతీష్ శనివారం ప్రారంభించారు. వృద్ధులు వ్యాయామం చేయడానికి అనువుగా ఉండే పరికరాలను ముళ్లపూడి సత్యనారాయణ సుజాత దంపతులు కృషితో దాతల నుంచి సేకరించిన రూ.లక్షతో కొనుగోలు చేశామని ఆశ్రమ నిర్వాహకులు మాజేటి అప్పలరాజు, మాజేటి సత్యనారాయణ తెలిపారు. ఈ పరికరాలను ఉపయోగించే విధానంపై దంపతులు కొద్దిరోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. సెలవు దినాల్లో చిన్నారులు ఆటవిడుపు కోసం పరికరాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. సురక్ష హాస్పిటల్ డాక్టర్ దిలీప్ కుమార్, లలిత ప్రియ హాస్పిటల్ డాక్టర్ రాజశేఖర్, సాయి ఎమర్జెన్సీ హాస్పిటల్ డాక్టర్ పి.రాజశేఖర్, రోటరీ క్లబ్ సభ్యులు సహాయ సహకారాలు అందజేశారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



గణపవరంలో సెమిస్టర్–2 పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ బాలయ్య

గణపవరం: నిర్ణీత సమయానికి సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను ఎఫ్‌ఏ–2 పరీక్షలకు సిద్ధం చేయాలని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. శనివారం గణపవరంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులోగా సెమిస్టర్–1 సిలబస్ పూర్తి చేయాలన్నారు. వెంటనే సెమిస్టర్–2 పాఠ్యాంశబోధన చేపట్టాలని, ఎఫ్‌ఏ–2, ఎస్‌ఏ–1, పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వీరవేణి, సీఆర్‌పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దెందులూరు: మండలంలోని మసీదుపాడు గ్రామానికి చెందిన కే.సువర్ణరాజు తీవ్ర అనారోగ్యం బాధపడుతుండతో 2000 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు మేమున్నామంటూ రూ.56 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రమాదవశాత్తు ఇటీవల సువర్ణరాజు మృతి చెందాడు. మరోసారి మిత్రులందరూ సువర్ణ రాజు కుటుంబ సభ్యులకు నగదు, నెలవారి సరుకులు శనివారం రాంబాబు వారి నివాసంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

8, 9 తేదీల్లో క్రీడా ఎంపికలు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట) : ఏలూరు మండల లెవెల్, అర్బన్, రూరల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ ఫెడేషన్ ఎంపికలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ అరుణ్ కుమార్ తెలిపారు. శనివారం శనివారపుపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8, 9 తేదీల్లో ఎస్‌జీఎఫ్ మండల, అర్బన్ స్థాయి ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ తదితర విభాగాల్లో అండర్–14 బాలురు, బాలికలు, అండర్–17 బాలురు బాలికలకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.ప్రకాష్, మండల కోఆర్డినేటర్ పి.పద్మలత, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రమేష్, దుర్గాప్రసాద్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు మురళి పాల్గొన్నారు.

పోరుబాట కరపత్రాల పంపిణీ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరు కావాలని ఫ్యాప్టో నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం భోజనం విరామ సమయంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 7న చలో విజయవాడ పోరుబాట కరపత్రాలు, పోస్టర్లను ఏలూరు రూరల్ మండలంలోని చాటపర్రు, మాదేపల్లి, జాలిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అందజేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ జి.మోహన్, ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు వి.మురళీకృష్ణ, మండల ఫ్యాప్టో నాయకులు వి.జేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల బదిలీల్లో ముగ్గురు టీచర్ల చేరిక

భీమడోలు: అంతర్ జిల్లాల బదిలీల్లో భీమడోలు మండలానికి ముగ్గురు టీచర్లు శనివారం మండలంలోని భీమడోలు నెం.1, నెం.3, గుండుగొలను నెం.1 పాఠశాలలకు చేరారు. శనివారం భీమడోలు ఎంఆర్సీలో ఎంఈఓ–1 ఈదుపల్లి శ్రీనివాసరావు ఉత్తర్వులను అందించారు. పదవీ విరమణ వల్ల ఖాళీగా ఉన్న ఈ మూడు స్థానాలను భర్తీ అయినట్టు చెప్పారు. మల్లారం, కొండ్రెడ్డినగర్, పూళ్ల నెం.2 పాఠశాలల్లో ఒకొక్క పోస్టు చొప్పున ఖాళీగా ఉన్నాయని, వారిని డీఎస్సీలో ఎంపికైన టీచర్లతో భర్తీ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

యువకుడికి విద్యుత్ షాక్

కామవరపుకోట: విద్యుత్ షాక్‌కు గురై యువకుడుకి తీవ్ర గాయాలైన ఘటన ఆడమిల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆడమిల్లికి చెందిన బోనల వంశీ స్థానిక విద్యుత్ లైన్‌మెన్ వద్ద ప్రైవేట్ సహాయకునిగా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం గ్రామంలో మద్దుకూరి సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తూ ఉండగా ఒక్కసారిగా సరఫరా రావడంతో షాక్ గురై మంటల చెలరేగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వంశీని ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వంశీ ఆరోగ్యం విషమంగా ఉందని తెలిపారు. అయితే విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని, గతంలో ఇలాంటి ఘటనలు మండలంలో జరిగిన సందర్భాలు చాలా ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

అక్రమ కట్టడాలను కూల్చివేయాలి



కుక్కునూరులో సమావేశమైన ఆదివాసీ నాయకులు

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు చేపట్టిన అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల ప్రత్యేక హక్కులను పాలకులు, అధికారులు అమలు చేయడంలేదని ఆరోపించారు. అక్రమ కట్టడాలను అడ్డుకోకపోవడం దారుణమన్నారు. పోలవరం ముంపు భూసేకరణలో కూడా గిరిజనేతరులు ఆదివాసీ భూములను కబ్జాచేసి తప్పుడు పద్ధతుల్లో పోలవరం నష్టపరిహారం పొందారని ఆరోపించారు. అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని గిరిజనేతరులకు దోచి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ చట్టాల అమలులో పాలకులు విఫలమవుతున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో నాయకులు సరియం ప్రసాద్, పొడియం వేణు, పైదా బుర్రయ్య, బిట్ట శివలింగయ్య, జెట్టి రఘుబాబు, పైదా చిన్నబాబు, కూరం ప్రసాద్, తుర్సం నరసింహారావు, వెలకం అశోక్‌కుమార్, కుంజా ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.